కర్నూలు | నంద్యాల
వార్త
6 మార్చి , 2025 గురువారం పేజీలు 4

# కెసికెనాల్ క్రింద సాగుచేసిన పంటలను కాపాడుతాం..

- జలవనరులశాఖ మంత్రి నిమ్మల, ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్‌తో మంత్రి ఫరూక్ భేటీ
- కెసిరైతుల సమస్యలను వివరించిన మంత్రి ఫరూక్



**నంద్యాల, మార్చి 5, ప్రభాతవార్త ప్రతినిధి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కెసికెనాల్ ఆయకట్టు క్రింద సాగుచేసిన రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్రన్యాయశాఖ,మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్ భరోసా ఇచ్చారు. ప్రస్తుత రబీసీజన్‌లో వివిధ రకాల పంటలను కెసి క్రింద రైతులు సాగుచేశారన్నారు. ఈ పంటలు ప్రస్తుతం వివిధదశల్లో ఉన్నాయన్నారు. నీరు అవసరమైన సమయంలో అధికారయంత్రాంగం సాగునీటి విడుదలను నిలిపివేసిందనా న్నరు. నీటి సరఫరా ఆగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీంతో సమస్యను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మలరామానాయుడు, జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్, కార్యదర్శి రామసుందరరెడ్డి, ఇఎన్‌సి వెంకటేశ్వరరావులకు మంత్రి ఎన్ఎండి.పరూక్ వివరించారు. బుధవారం మంత్రి నిమ్మలరామానాయుడు, ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్‌లు ఉమ్మడి కర్నూలు జిల్లా జలవనరులశాఖ అధికారులతో కెసి ఆయకట్టు పంటలపరిస్థితిపై మాట్లాడారు. కెసి క్రింద సాగుచేసిన పంటలు ఎండిపోకుండ చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వం రైతుసంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కెసికెనాల్ ఆయకట్టు క్రింద సాగుచేసిన రైతులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ తెలియజేశారు.

## నగరంలో క్రీడల.. అభివృద్ధికి కృషిచేస్తాం

- రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్



**కర్నూలు విద్య, మార్చి 5, ప్రభాతవార్తః**

నగరంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తు క్రీడాభివృద్ధికి కృషిచేస్తామని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎస్టీబిసి కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ లీగ్ పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర ్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. బంగారుపేటకు చెందిన నీలి షికారులు నిర్వహిస్తున్న బిపిసిఎల్ పోటీలకు స్థానికులే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక వంటి ప్రాంతాల నుండి కూడ క్రీడాకారులు కర్నూలుకు వచ్చి ఆడడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఏవరితో సహకారం తీసుకోకుండా ఎంతో క్రమశిక్షణతో నాలుగు సంవత ్సరాలుగా ఈపోటీలు నిర్వహించడం చిన్నవిషయం కాదన్నారు. టీజీ భరత్ ప్రీమియర్ లీగ్ పేరుతో కర్నూలు నగరంలో ఇలాగే తాము కూడ పోటీలు నిర్వహించి యువతకు ప్రోత్సాహాన్ని అందిస్తామని టీజీ వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విటల్‌శెట్టి, బంగారుపేట ప్రీమియర్ లీగ్ అర్గనైజర్లు సురేష్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఎండలతో పేదవాడి ఫ్రిజ్‌కు.. పెరిగిన డిమాండ్..!

- అధిక సంఖ్యలో కుండల తయారీ
- ఫ్రిజ్‌లు ఉన్న వారు కూడా కుండల కొనుగోలు
- కుండ నీరు శ్రేష్ఠమని నమ్ముతున్న ప్రజలు
- ఎండకాలంలో పేదవాడి ఫ్రిజ్‌గా భావించే ..

కుండల తయారీ కూడా అత్యధికమే..





**వాతావరణంలో మార్పులు దైనందిన జీవనం పై ప్రభావం తీసుకోస్తుంది. ఎండల తీవ్రత పెరుగుతోంది. ఇందుకు తగ్గట్లుగానే ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్లు, ఏసీల కొనుగోళ్లు పెరిగాయి. ఆర్థిక స్థితిగతులను బట్టి ఎవరికి తగ్గట్లుగా వారు కొనుగోలు చేస్తుండడం పేదవారు, ధనవంతులన్న బేధం లేకుండా కుండల కొనుగోళ్లు జరుగుతున్నాయి. కుండలలో నీరు శ్రేష్ఠమని పలు వర్గాలు నమ్ముతుండడం ఇందుకు కారణం కాగా అత్యధిక సంఖ్యలో కుండల తయారీ కూడా మరో పక్క జరుగుతుంది. కుండల్లో పలు రకాల కుండల అమ్మకాలు సాగుతున్నాయి. అన్ని మట్టి కుండలే అయినప్పటికి వాటి ఆకారాల్లో మార్పులు ఉంటున్నాయి. ఎండ కాలం వచ్చిందంటే అన్ని వర్గాల ప్రజలు తమ వ్యవహారిక కార్యకలాపాల్లో ఎంతో కొంత మార్పులు చేర్పులు చేసుకోక తప్పనిసరి పరిస్థితి.**

**ఆలూరు రూరల్, మార్చి5, ప్రభాతవార్త:** ఫ్రిజ్‌లు కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితిలేక పేదలు ఎండల తీవ్రతను తగ్గించుకునేందుకు ఉపయోగించుకునే కుండల్లో నీరు నిలువ ఉంచుకుని సేవించడం జరుగుతూ వస్తుంది. కొత్త కుండల్లో నీరు నిలువ ఉంచుకోవడం వల్ల కొంత వరక నీరు చల్లగా మారుతుంది. మరి కొంత మంది రెండు కుండలు తీసుకుని ఒక కుండలో నీటిని ఉపయోగించి మరో కుండలో నీటిని నిలువ ఉంచుతారు. కుండల్లో నిల్వ ఉంచిన కొన్ని గంటల తరువాత నీరు చల్లగా అవుతుంది. అందుకే కొంత మంది రెండు కుండలను వాడుతుండడం జరుగుతుంది. ఎండలు తీవ్రత రోజు రోజుకు పెరుగుతుండడంతో ఇందుకు తగ్గట్లుగానే కుండలకు కూడా డిమాండ్ పెరిగింది. వారం పది రోజుల వ ్యవధిలో కుండలకు సాధారణ రోజుల్లో ఉండే డిమాండ్‌తో పోలిస్తే ప్రస్తుతం ఐదారు రెట్లకు చేరుకుంది. కుండలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కుండల తయారీదారులు కూడా కుండలను సాధారణ రోజుల్లో తయారు చేసే దానికంటే అత్యధికంగా తయారు చేస్తుండడం జరుగుతుంది. ఆర్థిక స్థోమత బాగా ఉన్నవారు సైతం చాలా మంది కుండలో నీరు శ్రేష్ఠమని భావించి కుండలో నీటిని వాడుతున్నారు. చాలా మంది ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నవారు కూడా ఎక్కువ కుండ నీటికే ప్రాధాన్యమిస్తు న్నారు. ఎక్కువగా గొంతుకు సంబంధించిన వ్యాధి అనారోగ్య పరిస్థితులు ఉన్న చాలా మంది కూడా కుండల్లో నీటినే ఉపయోగిస్తున్నారు. వృద్దులకు మరియు పిల్లలకు ఇతరేత సమస ్యలు రావడంతో కుండలో నీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే సంబంధిత వ్యాపారస్థులు కూడా తమ తమ స్థోమతకు తగ్గట్లుగా కుండలను తయారుచేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.







## పారిశ్రామిక వర్గాల్లో ప్రభుత్వం ఒక విశ్వాసాన్ని కలిగించింది

- మంత్రి టీజీ భరత్



**కర్నూలు హాస్పిటల్, మార్చి 5, ప్రభాతవార్తః**

గత ఎనిమిది నెలల్లో పారిశ్రామిక వర్గాల్లో తమ ప్రభుత్వం ఒక విశ్వా సాన్ని కలిగించిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణి జ్యం ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే మాట్లాడేదానికి గానీ, లేదా ఏదైనా విషయం అడగడానికి కానీ వీలు కలిగిందని పారిశ్రామిక వేత్తలు చెప్పారని మంత్రి తెలిపారు. సుమారు రూ.6.50 లక్షల కోట్ల నిజమైన పెట్టుబడులు పెట్టెందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారన్నారు. లక్షల ఉద్యోగ అవకాశాలు కూడ ఏర్పడతాయన్నారు. చాల మంది సభ్యులు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని, పరిశ్రమలు తెప్పించాలని కోరుతున్నారన్నారు. సభ్యులు విజయ్‌కుమార్ రాజు, యార్లగడ్డ వెంకటరావు, కృష్ణ, చైతన్య, ఈశ్వర్‌రావు చెప్పిన అంశాలను తాను తన ప్రిన్సిపల్ సెక్రెటరీ నోట్‌చేసుకున్నామని దాన్ని పారిశ్రామిక వేత్తలతోను, మీ సమీక్షల్లో ఖచ్చితంగా చర్చించి ఎప్పటికప్పుడు తగుచర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ చెప్పారు. అంతకు ముందు శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచింగ్ గ్రాంట్‌ల విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన ్న కొనసాగుతున్న పనుల వివరాలు ఏంటని ఎమ్మెల్సీ వంక రవీంద్ర అడిగారు. అలాంటివి ఏమి లేవని మంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు భూముల కేటాయింపు విషయంలో పూర్తి సహకారం ఉందన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

## సబ్ రిజిస్టర్ పై.. బదిలీ వేటు..!

### వార్తా ప్రభావం

**కర్నూలు, మార్చి 05, ప్రభాతవార్త :**

నిషేధిత జాబితాలోని వక్ఫ్ బోర్డు భూములను రిజిస్ట్రేషన్ చేశారనే అభియోగాలపై కల్లూరు ఇంచార్జీ సబ్ రిజిస్ట్రార్ ను బదిలీ చేశారు. ఆ స్థానంలో ప్రవీణ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వక్ఫ్ బోర్డు భూములు అక్రమ రిజిస్ట్రేషన్ అవుతున్నాయి అనే అంశంపై "వార్తా" దినపత్రిక బుధవారం "వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్" కథనాన్ని ప్రచురించింది. అందులో కల్లూరు పరిధిలో వివిధ సర్వే నెంబర్లలోని వక్ఫ్ బోర్డు భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయని పేర్కొంది. ఆ విషయంపై మైనార్టీ సోదరుల వ్యతిరేకత వస్తున్నట్లు వివరించడం జరిగింది. మరికొన్ని సమస్యలను కూడా "వార్తా" దినపత్రిక ఎత్తి చూపించింది. ఆ కథనంపై స్పందించిన అధికారులు కల్లూరు ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ ను ఆ స్థానం నుంచి మార్చారు. ప్రవీణ్ కుమార్ ను అక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన కల్లూరు సబ్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టారు.

## బృందావనానికి.. టిటిడి పట్టువస్త్రాలు సమర్పణ

- ప్రత్యేక పూజలతో బృందావానికి అలంకరణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**మంత్రాలయం,మార్చి 5,ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనానికి టిటిడి అధికారులు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు.శ్రీ రాఘవేంద్రస్వామి పట్టాభిషేక మహోత ్సవాల్లో భాగంగా టిటిడి డిప్యూటీ ఈఓ లోకానందం ఆధ్వర్యంలో ఈవస్త్రాలు సమర్పిం చారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు స్వయంగా స్వాగతం పలికారు.వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి బృందావనానికి అలంకరించారు. అనంతరం బృందావనానికి విశేష పూజలు చేశారు. మూలరాముల పూజ,పల్లకిసేవ నిర్వహించి అశేష భక్తులమధ్య చెక్క,వెండి,స్వర్ణ రథాలపై స్వామివారిని ఊరేగించారు.ఈ ఉత ్సవాల్లో భాగంగా పట్టువస్త్రాలు తీసుకొచ్చిన టిటిడి డిప్యూటీ ఈఓను పీఠాధిపతి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. మొమెంటో, దుశ్శాలువా, ఫల,పుష్ప,మంత్రాక్షితలతో పీఠాధిపతి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి,మేనేజర్ వెంకటేష్‌జోషి,జోనల్ మేనేజర్శ్రీపతి ఆచారి అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి,పిఆర్ఓ వ్యాసరాజాచారి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







## శ్రీశైలం మల్లన్న హుండి ఆదాయం రూ.5.69కోట్లు



**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి05, ప్రభాతవార్త**

శ్రీశైలం మల్లన్నక్షేత్రం హుండి లెక్కింపులు బుదువారంనాడు జరిగాయి. ఈక్రమంలోనే హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.5,69,55, 455/-ల నగదు రాబడిగా లబించింది.కాగా ఆలయ హుండిల రాబాడిని భక్తులు గత 16 రోజుల్లో సమర్పించడం జరిగింది.ఈ నగదుతో పాటు 87 గ్రాముల 500 మిల్లిగ్రాముల బంగారం,5కేజిల 850గ్రాముల వెండి లబించాయి.అదేవిధంగా 885-యుఎస్ఏ డాలర్లు, 105-యూఏఈ దిరమ్స్ ,80-యుకే పౌండ్,2-సింగపూర్ డాలర్లు,5-కెనడా డాలర్లు మొదలైన విదేశీ కరెన్సికూడా ఈ హుండి లెక్కింపులో లబించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేప్పట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, పర్యవేక్షకులు,సిబ్బంది,శివసేవకులు పాల్గొన్నారు.

# జిల్లా జైలులో పోసానిని పరామర్శించేందుకు వెళ్లిన వైసిపి నాయకులు ..!

**కర్నూలు, మార్చి 05, ప్రభాతవార్త :**

ప్రముఖ సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పోసాని కృష్ణ మురళి కర్నూలు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గత సంవత్సరం లో ఆయన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్ప దమయ్యాయి. తమ నాయకుడిని కించపరిచే విధంగా పోసాని కృష్ణ మురళి మాట్లాడాలని జనసేన పార్టీ భావించింది. ఆ మేరకు ఆయనపై రాష్ట్రంలో పలు పోలీస్ స్టేషన్లలో ఇదే విషయంపై కేసులు నమోద య్యాయి. అందులో భాగంగా ఆదోనిలో జనసేన పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి రేణువర్మ 2024 నవంబర్ 14వ తేదీన ఆదోని మూడవ పట్టిన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు ఆదోని పోలీసులు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆయనను అరెస్టు చేయడం తరువాయిగా మిగిలింది. అయితే ఇప్పటికే ఆయనను అరెస్టు చేసి గుంటూరు జైల్లో ఉంచారు. దాంతో ఆదోని పోలీసులు పీటి వారెంట్ పై అతనిని గుంటూరు జైలు నుంచి తీసుకొచ్చారు. అయితే ఆదోని కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉన్న కారణంగా ఇన్చార్జి బాధ్యతలు చూస్తున్న కర్నూలు మొదటి అదనపు జ్యుడీషియల్ కోర్ట్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఆ న్యాయమూర్తి అతనిని 14 రోజులు రిమాండ్ కు తీసుకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు.అయితే ఆదోని జైలుకు తరలించాల్సి ఉండగా.. అనారోగ్య కారణాలు ఉన్నాయంటూ జిల్లా కేంద్రంలో సదుపాయాలు ఉంటాయన్న భావనతో... తనను కర్నూలు జిల్లా కేంద్రకారానికి తరలించాలని న్యాయమూర్తిని పోసాని కోరారు. ఆ మేరకు న్యాయమూర్తి ఆయనను కర్నూలు కేంద్రకారాగ రానికి తరలించాలని సూచించారు. ఇదిలా ఉండగా బుధవారం ఆయనను పరామర్శిం చేందుకు జైలు ములాకత్ సమయంలో పోసానిని కలిసేందుకు కొందరు వైసిపి నాయకులు వెళ్లినట్లు సమాచారం. కాగా ఆయనను విచారణ నిమిత్తం ఆదోని పోలీసులు కస్టడీ పిటిషన్ కోర్టులో సమ ర్పించి కస్టడీకి తీసుకెళ్తారా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా కర్నూలు నుంచి అనంతపురం పోలీసులు ఆయనను పీటి వారెంట్ పై తీసుకెళ్లే అవకాశం ఉంది.

## ఇచ్చిన మాట ప్రకారం.. కేసీ కెనాల్‌కు నీరు విడుదల..!



**ఆళ్లగడ్డ, మార్చి 5, ప్రభాతవార్తః**

కేసీ కెనాల్ రైతులకు నీరు తెప్పిస్తామని రైతులకు హామి ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ ఇచ్చిన మాట ప్రకారం బుధవారం సుంకేసుల నుండి 1700 క్యూసెక్కులు, మల్యాల నుండి 650 క్యూసెక్కుల నీరు మొత్తం 2250 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేయించారు. రైతుల వినతిమేరకు వారికిచ్చిన మాట ప్రకారం వ్యక్తిగతంగా శ్రద్ధతీసుకొని అధికారులతో మాట్లాడి కెసి కెనాల్‌కు నీరు తీసుకువచ్చిన ఘనత ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియకే దక్కుతుంది. కేసీ కెనాల్‌కు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియకు రుణపడి ఉంటామని కెసికెనాల ఆయకట్టు రైతులు తెలిపారు.

## యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి అమ్మవార్లను దర్శించుకున్న.. జిల్లా జాయింట్ కలెక్టర్

**బనగానపల్లెరూరల్, మార్చి5, ప్రభాతవార్త:**



బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి అమ్మవార్లను బుధవారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సి.హెచ్.విష్ణుచరణ్ దంపతుల దర్శించుకున్నారు. ఈ మేరకు వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జేసీ దంపతులచే స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలోని నందిమండపంలో జేసీ దంపతులకు యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి, ఆలయ కార్యనిర్వ హణాధికారి బి.చంద్రుడు శాలువలతో, పూలమాలతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు లోకనాథ్ శర్మ, ఆలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# విరిగిన విద్యుత్ స్తంభంతప్పిన.. పెను ప్రమాదం..!





**మిడుతూరు మార్చి 5 ప్రభాతవార్త:**

చుట్టుముట్టు ఆపదలు ఉన్నాయని హెచ్చరించిన, కర్తవ్యం మరచిపోయి, ముందుచూపు లేని వ్యక్తి ఏమిటి పనికిరాకుండా ప్రమాదాలకు నష్టాలకు కారకులై ఊహించని ప్రమాదాలు జరిగితే కుటుంబాలు వీధిన పడే అవకాశాలు ఉన్నాయి. మండల కేంద్రమైన మిడుతూరు లోని రహదారిలో మిరప బస్తాలతో వస్తున్న లారీ విద్యుత్ స్తంభం వైర్లకు తగిలి పెను ప్రమాదం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరు గాయపడలేదు. చింతలపల్లి గ్రామం నుండి ఎత్తుగా ఎండు మిరప బస్తాలతో లారీ వేగంగా వచ్చి విద్యుత్ వైర్లు బస్తాలకు తాకగా అదే సమయంలో లారీ ముందుకు పోవడంతో విద్యుత్ స్తంభం విరిగి నేల కూలింది. అదే సమయంలో విద్యుత్ స్తంభం విరిగిపడిన ప్రాంతంలో మెట్లు అరుగు బండలు పగిలి దెబ్బ తిన్నాయి. ఇక వైర్లు చెల్లాచెదరై రహదారిపై పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. డ్రైవరు విద్యుత్ వైర్లను గమనించకుండా వేగంగా లారీని నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఇటీవల గ్రామంలో ఎత్తుగా బస్తాలు వేసుకొని వస్తున్న లారీల వల్ల విద్యుత్ తీగలు తెగిపోయిన సందర్భాలు తరచుగా జరుగుతున్నాయి. ఇలాంటి సమస్యలు జరగకుండా సంబంధిత అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే అధిక లోడుతో లారీలు రావడం తీగలు తగలడం స్తంభాలు పడిపోవడం వాటితోపాటు ప్రాణాలు వదులుకోవాల్సి న పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లపై చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉంటుందని పలువురు అంటున్నారు.



## ఎంఎల్‌ఏలు, మంత్రుల నుంచి రూ.37వేల కోట్ల రోడ్లకు వినతులు

- మంత్రి బిసి జనార్ధనరెడ్డి

**నంద్యాల, మార్చి 5, ప్రభాతవార్త ప్రతినిధి**



రాష్ట్రంలోని ఎంఎల్‌ఏలు, మంత్రులు తనకు రూ.37వేల కోట్ల రోడ్లకు సంబంధించి ప్రతిపాదనలు అందిం చారని మంత్రి బిసి జనార్ధన రెడ్డి బుధవారం వెల్లడించారు.బడ్జెట్ మేరకు ప్రతి నియోజకవర్గంలో రోడ్లమరమ్మ త్తులు, అభివృద్ధికి కృషి చేస్తున్నామ న్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు. అవకాశమున్నంతవరకు అందరికి సమన్యాయం జరిగేలా రోడ్లను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామని బిసి.జనార్ధనరెడ్డి తెలియజేశారు.

# మహిళ చదువు.. ఇంటికి వెలుగు



**- క్లస్టర్ యూనివర్సిటి రిజిస్ట్రార్ డా.కట్టా వెంకటేశ్వర్లు**

**కర్నూలు విద్య, మార్చి 5, ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని మహిళా చదువుకుంటే ఆ ఇంటిల్లిపాది చదువుకున్నట్లేనని క్లస్టర్ యూనివర్సిటి రిజిస్ట్రార్ డా.కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మహిళా వారోత్సవాల సందర్భంగా బుధవారం క్లస్టర్ యూనివర్సిటి మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ అక్తర్ భాను అధ్యక్షతన సిల్వర్ జూబ్లి డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్లకార్డులతో బి క్యాంపు విజ్ఞాన్ మందిర్ సర్కిల్ వరకు బేటి బచావో బేటి పడావో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరయిన రిజిస్ట్రార్ డా.కట్టా వెంకటేశ్వర్లు ర్యాలీని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మహిళ లేకపోతే మనుగడ లేదని ఈవిషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించుకొని మహిళలతో సత్‌ప్రవర్తతో మెలగాలన్నారు. కుటుంబంలో స్త్రీ పురుషులు ఇద్దరు సమానమేనన్నారు. క్లస్టర్ యూనివర్శిటి మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డా.అక్తర్ బాను మాట్లాడుతూ మహిళా వారోత్సవాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అదేశాల మేరకు మూడవ తేది నుండి నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్, ఉమెన్ న్యూట్రిషన్ ఎగ్జిబిషన్, వ్యాసరచన వక్తృత్వపు పోటీలు కూడ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటి డీన్‌లు డా.నాగరాజ్ శెట్టి, డా.వాహిద్, అధ్యాపకులు డా.ఎల్లాకృష్ణ, డా.అనుష, డా.ఫామీద, డా.మద్దయ్య, డా.విమల, డా.వినోలియా, డా.స్వప్నశ్రీ, డాక్టర్ పార్వతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**కొత్తపల్లె, మార్చి 5, ప్రభాతవార్త:** గ్రామాల్లో వున్న ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు నీరు కలుషీతం కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని తహశీల్దార్ ఉమా రాణి, ఎంపీడిఓ మేరిలు ఆర్వోప్లాంట్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలలోని దుద్యాల గ్రామంలో ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నందు పరిశుభ్రత పాటించాలన్నారు. నీరు శుద్దచేసేటప్పుడు ఎంతమోతాదులో కెమికల్ వాడుతున్నారని అరాతీశారు. అనంతరం నిర్వాహకులకు పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు ఇస్తున్నామన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశీలించిన రెండు ఆర్వోప్లాంట్‌లలో ఎలాంటి సమస్యలు లేవని సదుపాయాలు బాగున్నాయన్నారు. ఈతనిఖీల్లో ఈఓఆర్డీ పార్థసారధి, పలువురు అధికారులు, ఆర్వో ప్లాంట్ నిర్వాహకులు ఉన్నారు.

## నిరుపేదలకు నిత్యావసరవస్తువులు పంపిణీ

**వెల్దుర్తి, మార్చి5, ప్రభాతవార్త**

వెల్దుర్తి పట్టణంలోని రాజు లక్కీ ట్రైల్స్ యజమాని రాజు తన కుమారుడు చిన్నారి భరత్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షులు వి.యం.హరిసింహానాయుడు ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేపట్టారు. స్థానిక నారాయణరెడ్డి నగర్‌లో నివాసముంటున్న నిరుపేదలకు నిత్యావసరవస్తువులతో పాటు అన్నదానం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. నిరుపేద అంజనమ్మకు కొంత నగదును సైతం ఇచ్చారు. అదేవిధంగా భువనగాయత్రీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ నిర్వాహకులకు కొంత నగదు, నిత్యావసరవస్తువులు అందించారు. మూగజీవాలకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా దాత రాజు మాట్లాడుతూ హెల్పింగ్‌హ్యాండ్స్ చేస్తున్న సేవాకార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని తమ ఇంట ఏ వేడుక జరిగినను తన వంతు నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

## వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి

**- మండల ప్రత్యేక అధికారిణి శ్యామలమ్మ**



**సిబెళగల్, మార్చి5, ప్రభాతవార్త:** రానున్న వేసవిలో మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారిణి శ్యామలమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొత్తకోట గ్రామంలో ఎంపిడివో రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనె నాయక్‌లతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిణి మాట్లాడుతూ వేసవికాలంలో మండల వ్యాప్తంగా ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆమె సూచించారు. నీటి ఎద్దడికి గురయ్యే గ్రామాలను ముందస్తుగానే గుర్తించి అవసరమైన ప్రాంతాల్లో నీటి సరఫరాను పునరుద్దరించాలని, నీటి రవాణాకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి నీటి సరఫరా అయ్యే ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలు ఇళ్ల వద్ద నీటి వృధాను అరికట్టాలని సూచించారు. అలాగే గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 7న వివేకానంద డిగ్రీ కళాశాలల్లో జాబ్ మేళా

**కోడుమూరు, మార్చి 5, ప్రభాతవార్త:** స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 7వ తేదిన నిరుద్యోగ యువతి, యువకులకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ గోట్ల శేఖర్, ప్రిన్సిపాల్ విజయకుమార్లు నేడొక సంయుక్తా ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని జిల్లా స్కిల్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్ సారధ్యంలో నిర్వహిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు ఫ్లిప్ కార్డు, సెల్ ఫోన్ వస్తువుల తయారీ కంపెనీలతో పాటు ముత్తూట్ ఫైనాన్స్ లాంటి కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఎంబిఏ, ఎంకామ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశాలున్నాయన్నారు. ఆసక్తి కల్గిన నిరుద్యోగస్తులు ఉదయం 10.00 గంటలకు వారి విద్యార్హత అర్హత కల్గిన సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి సాయి తేజ, జిల్లా స్కిల్ అధికారి వై.వీరేష్‌ల సారధ్యంలో జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తారని వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## హనుమాన్ జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు

**- జంగమ మహేశ్వరసంఘం, హనుమాన్ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం..**



**వెల్దుర్తి, మార్చి5, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో జంగమ మహేశ్వరసంఘం మండల ఇంచార్జ్ చాముండేశ్వరి, హనుమాన్ ఆలయ నిర్వాహకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రంను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్సై శివరామిరెడ్డి హాజరై రిబ్బన్ కట్‌చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎస్సై చలివేంద్రంలో స్వయంగా అక్కడకు వచ్చిన వారికి త్రాగునీరు ఇచ్చి దాహర్తిని తీర్చారు. ఏఎస్సై మాట్లాడుతూ మండు వేసవిలో వాహనదారులు, ప్రయాణికులు, బాటసారుల దప్పిక తీర్చేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. జంగమ మహేశ్వరసంఘం మండల ఇంచార్జ్ చాముండేశ్వరి, హనుమాన్ ఆలయ నిర్వాహకులు రామాంజనేయులు, ఆ సంఘం నాయకులు మల్లికార్జునయ్య, దుగ్గినాగేశ్వరయ్య, మహిళభక్తులు బుజ్జక్క, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## యల్.నగరం తాండాలో నవోదయం కార్యక్రమంపై అవగాహన



**వెల్దుర్తి, మార్చి5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని యల్.నగరం తాండాలో బుధవారం ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ శ్రీమతి శ్రీదేవి ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధింత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె నాటుసారా వల్ల జరిగే అనరాల గురించి వివరించారు. నాటుసారా తయారీ అమ్మకం దారుల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తయారీ మానుకొని వారి మీద పిడి యాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసి హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, ఏఇఎస్ రాజశేఖర్‌గౌడ్, ఇఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజంద్రప్రసాద్, ఏఎస్సై శివరామిరెడ్డి, విఆర్ఓ క్రిష్ణమూర్తి, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, కోడుమూరు ఎక్సైజ్ సిఐ మంజుల, ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టిస్ కేసు నమోదు

**కర్నూలు విద్య, మార్చి 5, ప్రభాతవార్త:** జిల్లాలో అపాస్ ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో ఒకరిపై మాల్‌ప్రాక్టిస్ కేసు నమోదుచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. జిల్లా నుండి అపాస్ ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షకు రెండవ రోజు మొత్తం 1119 మంది విద్యార్థిని విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా, 997 మంది పరీక్షకు హాజరు కాగ 122 మంది గైర్హాజరయ్యారు తెలిపారు. మొత్తం 9 పరీక్షా కేంద్రాలకు 5 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షాకేంద్రాల్లో పర్యటించారని ఒకరిపై మాల్‌ప్రాక్టిస్ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## సమ్మెకాలపు ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలి

**- ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసిన ఉద్యోగులు**

**కౌతాళం, మార్చి05, ప్రభాతవార్త;** సమ్మె కాలపు ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జేఏసీ మండలాధ్యక్షులు వై.రామాంజనేయులు, ఉపాధ్యక్షులు కేజీబీవీ ప్రిన్సిపాల్ పుష్పావతి మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. మినిమం టైం స్కేల్ అమలుపరిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సంవత్సరానికి ఒకేసారి బడ్జెట్ రిలీజ్ చేయాలన్నారు. జీవో నంబర్ 2ను సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తించేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకోవాలన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. పై డిమాండ్స్‌పై వెంటనే అమలు చేయని పక్షంలో ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర జేఏసీ నాయకులు పెద్ద ఎత్తున అన్ని జిల్లాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు బయలుదేరి దీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సి.రమేష్, కోశాధికారి కె.రామన్న, జేఏసీ కమిటీ సభ్యులు మాబాషా, అకౌంటెంట్ వరదరాజులు, షబానా పర్వీన్, సాయికుమార్ పాల్గొన్నారు.

## సింగరాజనహళ్ళిలో చోరీ

**:-తులం బంగారు, రూ.70,000 నగదు దొంగతనం**

**:-సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్‌టీం -కేసు నమోదు చేసిన పోలీసులు**

**మంత్రాలయం, మార్చి 5, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం మాధవరం పోలిస్ స్టేషన్ పరిధిలోని సింగరాజనహళ్ళి గ్రామంలో చోరీ జరిగినట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు గ్రామానికి చెందిన బోయలక్ష్మి తమ కూతుర్లతో కలిసి పెద్దకడబూరు మండలం బాపురం గ్రామంలో జరిగే గంగమ్మ జాతరకు వెళ్ళారు. జాతర ముగించుకొని ఉదయం తమ ఇంటికి వచ్చి చూడగా తమఇంటి తాళాలు పగులగొట్టి తమ ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్నతులం బంగారు నగలు, రూ.70,000 నగదును దుండగులు ఎత్తుకెళ్ళినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మాధవర ం పోలీసులు క్లూస్‌టీంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## గూళ్యంలో ఘనంగా వసంతోత్సవం...

**- కలశాలతో నైవేద్యం సమర్పించేందుకు ఆలయానికి తరలివచ్చిన మహిళలు, భక్తులు,**



**హాలహర్వి, మార్చి05, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామంలో శ్రీ సిద్ధలింగేశ్వర, గాదిలింగేశ్వరస్వాముల జోడు రథోత్సవ ఉత్సవాల సందర్భంగా బుధవారం వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసంతోత్సవం సందర్భంగా స్వాములవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ఆడపడుచులు కలశాలతో స్వాములవారికి నైవేద్యం సమర్పించారు. వసంతోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హాలహర్వి ఎస్ఐ చంద్ర బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఈఓ రాధాకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు మల్లన్న, బజారప్ప, వీరేశప్ప, కుమార్, లింగమల్లప్ప, పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయమైన అరెస్టను ఎస్‌డిపిఐ తీవ్రంగా ఖండిస్తుంది

**కర్నూలు హాస్పిటల్, మార్చి 5, ప్రభాతవార్త:** ఎస్‌డిపిఐ జాతీయ అధ్యక్షులు ఎంకె ఫైజిని అకారణంగా ఎన్‌ఫోర్స్ డైరెక్టర్ (ఈడి) అరెస్టుచేసిన సంఘటను తీవ్రంగా ఖండిస్తు, అరెస్టును నిరసిస్తు ఎస్‌డిపిఐ వారు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈఅన్యాయమైన అరెస్టును ఎస్‌డిపిఐ తీవ్రంగా ఖండిస్తుంది. తక్షణమే ఎంకె ఫైజిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జహింగీర్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాస్వామ్య విపక్షాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. అలాగే న్యాయమైన పోరాటం ద్వారా ఎంకె ఫైజి విముక్తికోసం కృషిచేస్తామని ఈవిషయంలో సత్యం నిగ్గుతేలేవరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎస్‌డిపిఐ నేత అమీర్ మాఫియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తు ఎంకె ఫైజి అరెస్టు రాజకీయ కక్షతో జరిగిందన్నారు. ఎస్‌డిపిఐ కర్నూలు నగర అధ్యక్షుడు జుబేర్‌ఖాన్, విరసం నాయకుడు పినాక పాణి, నగర ఉపాధ్యక్షుడు షేక్ మొహిన్, నగర ప్రధాన కార్యదర్శి సలీం బాషా, ఎస్‌డిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**- గ్రామాలలో ముందే సమస్యలు గుర్తించాలి**

**తుగ్గలి, మార్చి 5, ప్రభాతవార్త:** వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎక్కడ కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామాలలో ముందేసమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎం.పి.పి.అద్దంకి ఎర్ర నాగప్ప అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోఎం.పి.డి.ఓ. విశ్వమోహన్ ఆధ్వర్యంలో ఎం.పి.పి.అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.పి.పి.మాట్లాడుతు అధికారులు, మండల ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాల్లో సమస్యలు గుర్తించి అభివృద్ధి పనులకు సహకరించాలని, అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాముకూడా కఠినంగా వ్యవహరిస్తామని, సమావేశానికి హాజరుకాని అధికారులపై సంభంధిత జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎం.పి.పి.హెచ్చరించారు. ప్రధానంగా వేసివి కాలం కావున నీటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు ముందుగానే చేపట్టాలని, నీటిని వృధాకాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి పులికొండ నాయక్, మండల విద్యాధికారి మాలతి, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, మండల ఏఓ పవన్‌కుమార్, ఆర్‌ఢబ్ల్యూఎస్ ఏఈ నవీన్, సిడిపిఓ లలిత, ఈఓఆర్డీ శ్రీహరి, ఏపిఓ హేమసుందర్, ఏపిఎం రాధాకృష్ణ, పగిడిరాయి వైద్యాధికారిహారిక, ఎం.పి.టి.సి.లు, సర్పంచులు, పంచాయితీఈ కార్యదర్శిలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రమట్టిని తరలిస్తే కేసులు

**- మైన్స్ అండ్ జియాలజీ జిల్లా సహాయ అధికారి రాజశేఖర్**



**ఆలూరు రూరల్, మార్చి5, ప్రభాతవార్త:** అక్రమంగా ఎర్రమట్టిని తరలించే వారి పై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తామని మైన్స్ అండ్ జియాలజి శాఖ జిల్లా సహాయ అధికారి రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ గ్రామ సమీపంలో కృష్ణాపురం కొండల్లో తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు స్థానిక రెవెన్యూ అధికారులు సైతం నిఘా ఉంచాలన్నారు. తవ్వకాలు ఎవరు జరిపారన్న విషయం పై విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట రాయల్టీ అధికారి సాంబశివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్వో అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేసిన నోడల్ ఆఫీసర్



**పత్తికొండ, మార్చి 5, ప్రభాతవార్త:** పట్టణ కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఆయుష్ మందిర్‌లో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్.రఘు తనిఖీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు వడదెబ్బ లక్షణాలు మరియు ప్రథమ చికిత్స గురించి అవగాహన కల్పించాలని స్థానిక వైద్యాధికారికి సూచించారు. ఎండల తీవ్రంగా ఉన్నప్పుడు మనిషి శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మండల నాడి వ్యవస్థ దెబ్బతినడం వలన వడదెబ్బ వస్తుందని, శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో40శాతం మరణాలు సంభవిస్తాయని ఇది చాల ప్రమాదకరమైనదని ఆయన తెలిపారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలుఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్ వాడాలని, సాధ్యమైనంతలో మధ్యాహ్నం ఎంతలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుజాత, వైద్య సిబ్బంది కరుణ, చాముండేశ్వరి, ఆశా ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో ఈసిసిఈడే



**నందికొట్కూరు, మార్చి 5, ప్రభాతవార్త:** ఈసీసీఈ డే సంధర్భంగా పట్టణంలోని 29,14,5,23 అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ సిడిపిఓ కోటేశ్వరి తనికీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఎదుగుదల పర్యవేక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వారి సమక్షంలోనే పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి పోషన్ ట్రేకర్ యాప్లో నమోదు చేసి వారి పిల్లల పోషణ స్థితిని వారికి వివరించారు. అనంతరంఇంటిదగ్గర తల్లులు పిల్లల పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిస్ సూపర్‌వైజర్ ఆశీర్వాదమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలి

**- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలి**

**- ఏఐకేఎస్ సభ్యత్వ నమోదులో నాయకుల డిమాండ్**

**దేవనకొండ, మార్చి05, ప్రభాతవార్త;** రైతాంగానికి మండల గిట్టుబాటు ధధల హామీ చట్టాన్ని అమలు చేయాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్ర, రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు వై.కందప్ప, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావులు డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రమైన దేవనకొండలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు దాదాపుగా 200 రకాల పంటలకు పైగా పండిస్తున్నా, కేవలం 20 నుంచి 25 రకాల పంటలకే మద్దతు ధర ప్రకటిస్తున్నాయన్నారు. అది కూడా స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అమలు చేయడం లేదన్నారు. ఏ గ్రేడ్ మిర్చి ధర ప్రస్తుతం రూ.17 వేలు గా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.11,700 ఇస్తున్నామని చెప్పుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల పేరు చెప్పి అధికారం చేపట్టి పబ్బం గడుపుకుంటున్నారని వాపోయారు. రైతులను విస్మరిస్తే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు కృష్ణ, రవికుమార్, హనుమప్పప, కోదండ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం

**- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీమోహన్**



**దేవనకొండ, మార్చి05, ప్రభాతవార్త;** వేసవి సమీపిస్తున్న వేళ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ మండలంలో 140 చేతిబోర్లు ఉన్నాయని, మరమ్మతులు ఏవైనా ఉంటే ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి పుష్కలంగా తాగునీరు అందేలా చూస్తామన్నారు. బండగట్టు, క్రిష్టగిరి వాటర్ స్కీమ్‌ల ద్వారా మండలంలోని 22 గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని మాదాపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటి ఎద్దడి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుని తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

## ఉపాధ్యాయ శాశ్వత బదిలీ చట్టం - 2025లో మార్పులు చేయాలి



**పత్తికొండ, మార్చి 5, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ శాశ్వత బదిలీ చట్టం-2025లో కొన్ని మార్పులను చేయాలని జిల్లా ఆర్థిక కార్యదర్శి ఇట్రెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్టీయు ప్రాంతీ కార్యాలయంలో ఎస్టీయు మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ క్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ శాశ్వత బదిలీ చట్టం-2025లో కొన్ని మార్పులు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బదిలీల ప్రక్రియలో ఏదైనా అన్యాయం జరిగితే న్యాయ పోరాటానికి ప్రభుత్వం నియమించబడ్డ ప్రత్యేక అధికారిరాతపూర్వక అభ్యంతరం మాత్రమే కోర్టు పరిగణంలోకి తీసుకునే విధంగా అందులో చేర్చారు. దీనికి తోడుగా ప్రభుత్వం గుర్తింపు నపొందిన ఉపాధ్యాయ సంఘాలజిల్లా స్థాయి అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలకు కూడా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా అవివాహిత మహిళలకువయస్సుతో నిమిత్తం లేకుండా ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలని ఆయన కోరారు. బదిలీ అనే నిర్వచనంను పాఠశాల నుండి పాఠశాలకు కాకుండా అవాస ప్రాంతంనుండి అవాస ప్రాంతం తీసుకుంటే బాగుంటుందన్నారు. సాధారణ బదిలీ సమయంలో తప్ప తక్కిన ఏ సమయంలోనైనా ఉపాధ్యాయ బదిలీలు ప్రభుత్వం చేపట్టరాదని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు సీనియర్ నాయకులు నారాయణ, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, బీరప్ప, వెంకట్రాముడు, రాఘువేంద్ర, కృష్ణమూర్తి, ఇక్బాల్, హుస్సేన్, సూరి, మండల ప్రధాన కార్యదర్శి సంజీవయ్య, మండల ఆర్థిక కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జిల్లా నోడల్ అధికారి



**దేవనకొండ, మార్చి05, ప్రభాతవార్త;** మండలంలోని పొట్లపాడు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని బుధవారం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తనిఖీ చేశారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ స్త్రీ జన్మనిస్తూ మరణించకూడదని, ఏ శిశువు మరణించడానికే జన్మించకూడదని చెప్పారు. మాతా శిశు సంక్షేమం విషయంలో పగడ్బందీ ప్రణాళిక అమలు చేస్తూ మాతా శిశు మరణాలను తగ్గించవ్చని సూచించారు. వైద్య, ఆరోగ్య సేవల్లో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. దీనిపై దృష్టి పెట్టుకొని వైద్యసేవలు, ఇతర కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గర్భవతిగా నమోదు చేసుకున్న తర్వాత రక్తహీనత, మూత్ర పరీక్షలతో పాటు థైరాయిడ్, హెచ్ఐవీ, సిఫిలిస్ మరియు ఇతర సుఖ వ్యాధులు పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ చంద్రశేఖర్, సామాజిక ఆరోగ్యాధికారి భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త నాగవేణి, ఆశా కార్యకర్త, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## ఎల్లెల్సీ నీటితో ఊపిరీ పీల్చుకున్న భక్తులు

**గోనెగండ్ల మార్చి 5 ప్రభాతవార్త .**

మండల పరిధిలోని గంజహళ్ళి గ్రామంలో గురు, శుక్రవారాలలో జరుగుతున్న బడేసాహెబ్ ఉరుసు మహోత్సవంకు తాగునీటి రాకుండా ఉండేందుకు గాను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికి కొంత నీటి సమస్య కనిపిస్తుంది. ఈ ఉరుసుకు భక్తుల పెరగడంతో భక్తులకు ఎడారిలో నీటి చెలిమలా ఎల్లెల్సీ కాలువ కనిపించింది. గ్రామాల నుంచి ఉరుసు చేసేందుకు వచ్చే భక్తులు ఎల్లెల్సీ నీటిని తీసుకువెళ్ళేందుకు గాను ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్‌లలో భారీగా తరలిస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఉరుసులో భక్తులకు నీరు సౌకర్యం కోసం 20 ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారు.

## సరైన ధృవపత్రాలు అధికారులకు అందించాలి



**కొత్తపల్లె, మార్చి 5, ప్రభాతవార్త:** ఎన్‌హెచ్ 167-కె రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు వారి భూములకు చెందిన సరైన ధృవపత్రాలు అధికారులకు ఇవ్వాలని తహశీల్దార్ ఉమా రాణి రైతులకు సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామాలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 16 మంది రైతులు 9 ఎకరాల భూమి రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారన్నారు. వారు అధికారులకు భూమికి సబంధించిన ధృవపత్రాలు ఇవ్వలేదని వాటిని అందిస్తే నష్టపరిహారం అందేలా చుస్తామన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ పెద్దన్న, గ్రామ సర్పంచ్ నక్క విజయ్‌కుమార్, వీఆర్వోలు మౌలాలి, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

## ఆగవేళిలో వైభవంగా పెద్దదేవర ఉత్సవాలు

**క్రిష్ణగిరి, మార్చి5, ప్రభాతవార్త**

మండల పరిదిలోని ఆగవేళి గ్రామంలో బుధవారం రోజు పెద్దదేవర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఉత్సవాలను గ్రామస్తులు ప్రారంభించారు. బూదిపిల్లి వేషదారి అయిన వ్యక్తి బలిపూజకు సిద్ధ పరిచిన ఆహారంను గ్రామ పొలిమేర లా వెంబడి చల్లుకుంటూ టెంకాయులు సమర్పిస్తూ గ్రామం నలుమూలలు చేశారు. అనం తరం అమ్మవారికి కుంకుమ, పసుపు, నారికేళాదాలతో పాటు బలిహారంను కూడ సమర్పిం చారు. ఈ ఉత్సవ వేడుకలను గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు. అనంతరం ఉదయం 8గ ంటల సమయాన అమ్మవారి కి బోనాలు, సారె, చీరలను, గాజులు, పసుపు, కుంకుమలను పూలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ దేవర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పంటలకు మద్దతు అమలు చేయాలి

- కిఇసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ధర్నా
- జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసిన కిసాన్ మెర్చా




**నంద్యాల, మార్చి5, ప్రభాతవార్త ప్రతినిధి** సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా ప్రదాని నరేంద్రమోదీ రాతపూర్వకంగా రైతు సంఘాలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా బుధవారం నద్యాల పట్టణంలోని తహశీల్దారు కారా ్యలయం ప్రక్కన ఉన్న బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా టెంటువేసి ధర్నా చేపట్టి జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం, కౌలురైతుసంఘం, వ్యవవసాయకార్మికసంఘం, రైతుకూలీసంఘంం, రాయలసీమ సాగునీటి సాధనసమితి, సిఐటియు కార్మికసంఘం జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల రైతులు పాల్గొని మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించడంతో పాటు అన్నిరకాల పంటలకు గిట్టుబాటుధరలు కల్పించాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘాలు మాట్లాడుతూ 2021డిసెంబరు 9న దేశప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలో రైతుల ఆందోళనకు వచ్చి క్షమించమమని కోరి మద్దతు ధరల చట్టాన్ని అమలుచేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. జిల్లాలో వరిధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు బస్తాకు రూ.1000 నష్టపోతున్నారన్నారు. జిల్లా జాయింటుకలెక్టరు మార్క్‌ఫెడ్ ద్వారా కందులు, జొన్నలు, మినుములు, మొక్కజొన్నలు మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామని చెప్పడం తప్పితే ఆచరణయోగ్యం కాలేదన్నారు. ఉద్యానవన పంటలు పూతరాలి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. మద్దతుధరలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 10న గుంటూరులో నిర్వహించే రాష్ట్రధర్నాలో అందరు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కెపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్వులు టి.రమేష్‌కుమార్, రాజశేఖర్, రాయలసీమ సాగునీటిసంఘం జిల్లా నాయకులు వైఎస్.రెడ్డి, రామచంద్రారెడి ్డ, రైతుకూలీసంఘం నాయకులు ఆనంద్, రైతుసంఘం జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు మార్కు, సుధాకర్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్, సిఐటియు బాలవెంకట్‌లు మాట్లాడారు. ఈ కార్య క్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మణ్, ఎపి రైతుసంఘం జిలా ్ల ఉపాధ్యక్షులు రామేశ్వరరావు, సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శులు టి.రామచంద్రుడు, వెంకటేశ్వరరావు, వీరన్న, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ బకాయిలు చెల్లించని రైతుల ఆస్తులు జప్తు

బెల్డోన సహకార సొసైటీ సీఈవో హరిక్రిష్ణ వెల్లడి



**చిప్పగిరి, మార్చి ,05, ప్రభాతవార్త:** బెల్డోన సహకార సొసైటీ బ్యాంకులో రుణాలు తీసుకొని, చెల్లించని రైతుల ఆస్తులను జప్తు చేస్తున్నట్లు సీఈఓ హరిక్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం సొసైటీ బ్యాంకు అధికారులతో కలిసి చిప్పగిరి గ్రామంలో అప్పులు తీసుకున్న రైతుల ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చి ఆస్తులు జప్తు చేస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా సీఈవో హరిక్రిష్ణ మాట్లాడుతూ, సొసైటీ బ్యాంకులో తీసుకున్న రుణాలను రైతులు కచ్చితంగా రెన్యువల్ చేయాలని తెలిపారు. రుణాలు తీసుకొని ఏళ్ళ తరబడి చెల్లించకుండా ఉంటే ఆర్.బి.ఐ రూల్స్ కు విరుద్ధంగా ఉంటుందన్నారు. దీంతో వారి ఆస్తులను జప్తు చేయుటకు పూర్తి అధికారం బ్యాంకు అధికారులకు ఉందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించండి సిఇఓ రైతులకు వివరించారు. ప్రతి రైతు వెంటనే సొసైటీలో తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎం.కె ఫైజీ అరెస్టును త్రీవంగా ఖండించిన ఎస్ డి పి ఐ నాయకులు



**హొళగుంద మార్చి ,05, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన హోళగుంద లోని స్థానిక ఎస్ డి పి ఐ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆలురు అసెంబ్లీ అధ్యక్షులు హమీద్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు ఎం కె ఫైజీ అరెస్టును త్రీవంగా ఖండించిన వారు తెలిపారు అసమ్మతిని అణిచివేసేందుకు, రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ఈ అరెస్టు ప్రతీకార అని అన్నారు రాజకీయాలలో భాగం తప్ప మరొకటి కాదు. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మా జాతీయ అధ్యక్షులు ఎం. కె. ఫైజీని ఢిల్లీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడంపై తీవ్ర ఖండన వ్యక్తం చేశారు. తమ జాతీయ అధ్యక్షుడిని అరెస్టు చేయడం అసమ్మతి స్వరాన్ని అణిచివేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రతీకార రాజకీయం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. తప్పుడు అభియోగాలు మోపడం మరియు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం ద్వారా ప్రజాస్వామ్య ప్రత్యర్థులను భయపెట్టడం మరియు అణిచివేయడం పాలన యొక్క ఎజెండాలో భాగం. క్రూరమైన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రధాన స్రవంతిలో ఉన్న శీదీశ। పట్ల పాలన అసహనంతో ఉందనడానికి ఈ అరెస్టు స్పష్టమైన సూచన అని అన్నారు ఎస్ డి పి ఐ అటువంటి అణచివేత మరియు ప్రజావ్యతిరేక ఎత్తుగడలకు వ్యతిరేకంగా దాని పూర్తి స్థాయి మరియు స్ఫూర్తితో పోరాడటానికి కట్టుబడి ఉంటుందన్నారు.వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం ఫలితంగా ఎస్ డి పి ఐ జాతీయ అధ్యక్షులైన ఎంకె ఫైజి కేంద్ర ప్రభుత్వం తప్పుడు కేసులో అరెస్టు చేసేది అన్నారు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నం దేశవ్యాప్తంగా సాగిన పోరాటంతో కేంద్ర ప్రభుత్వానికి ముప్పు వాటిల్లింది అందుకే తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారు అని అన్నారు ఈ కానీ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు అసెంబ్లీ ఉపాధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ కార్యదర్శి కే సలాం మరియు హాఫీజ్ కోశాధికారి అల్లబకాష్ తదితరులు పాల్గొన్నారు

# పవర్ లిఫ్టింగ్‌లో విధ్యార్థినీల ప్రతిభ

- ప్రత్యేకంగా అభినందించిన ప్రిని ్సపల్

**మంత్రాలయం, మార్చి 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ఉన్న కెజిబివి పాఠశాలలో చదువుతున్న విధ్యార్థినీలు పవర్‌లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిని ్సపల్ శాంతి మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వైష్ణవి, లత, మైథిలి, జయశ్రీ, పూజ 8వ తరగతి చదువుతున్న నందిని, శిల్ప, జ్యోతి 7వ తరగతి చదువుతున్న హిందు, సునిత తదితర 13మంది విధ్యార్థినీలు ఈనెల 1,2వ తారీఖుల్లో వైజాగ్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనపరచారన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విధ్యార్థినీలను ప్రిని ్సపల్ శాంతి పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# సుండిపెంటలో కార్మికనేతకు ఘన నివాళి

**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి05, ప్రభాతవార్త**



నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం, శ్రీశైలం మండలం, సుండిపెంట కారి ్మకనేత అయిన కామ్రెడ్ జనార్ధన్‌రావు 22వ వర్ధంతి వేడుకలు బుధువారంనాడు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు నందు గల జనార్ధన్‌రావు విగ్రహంకు ఏఐటియుసి (హెచ్64)జనరల్ సెక్రటరి బండారు లక్ష్మయ్య అద్వర్యంలో పలువురు కారి ్మకులు సంయుక్తంగా పూలమాలలతో నివాళలు అర్పించారు. ఈ క్రమంలోనే ఆయన ఆత్మకు శాంతి కలుగాలని రెండు నిమిషములపాటు మౌనం పాటించారు. తదుపరి కామ్రెడ్ జనార్ధన్‌రావు గురించి నాయకులు మాట్లాడుతూ ఎడమగట్టు విధ్యుత్ కేంద్రంలో పనిచేసిన కాంట్రాక్టు కారి ్మకుల హక్కుల కోసం పోరాటం చేసి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపాడని కొనియాడారు. బడుగు, బలహీన, వర్గాల నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీల నిర్మాణం చేసారని చెప్పారు. వారి సేవలు శ్రీశైలంప్రాజెక్టు కాలనీలో ప్రజలు మరువరానివని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్64 నాయకులు రామయ్య, కుమార్, శంకర్, శ్రీను, అబ్దుల్లా, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో 80 శాతం వైద్యసేవలు అందుబాటులోకి



**కర్నూలు హాస్పిటల్, మార్చి 5, ప్రభాతవార్తః** కర్నూలు నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల యందు నెలకొల్పిన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ యందు 80 శాతం వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని అడిషనల్ అడిషనల్ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ కె ప్రకాష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే అత్యాధునిక పరికరం లినాక్ మిషన్ కూడ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఓపి సేవలు, ఇన్‌పేషెంట్ సేవలు, అందుబాటులోకి వచ్చాయని మరికొన్ని అపరేషన్ థియోటర్ పరికరాలు రావాల్సి ఉందని అవి వచ్చిన వెంటనే త్వరలో అపరేషన్ థియోటర్ సేవలు కూడ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వారు తెలిపారు.

# ఆదర్శపాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

**రుద్రవరం, మార్చి5, ప్రభాతవార్త**



రుద్రవరం ఆదర్శపాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ సంగెపునాగేశశ్వరావు అధ్యక్షతన జిసిడిఓ సువర్చల సమక్షంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ గురించి బుధవారం అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో డా.చాయేంద్ర కుమార్( స్టేట్ పిఇఎంయు సమగ్రశిక్ష) మాట్లాడుతూ జీవితం చాలా విలువైనద న్నారు. జీవితాన్ని ఆనందమయంగా మార్చుకోవాలంటే విద్య అనేది ఒక సాధనమన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్య మన జీవిత ప్రయాణంలో వ్యక్తిగతజీవితాన్ని పదునుపెట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. విద్య విమర్శనాత్మక ఆలోచనకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోనికి వచ్చిన నేటియుగంలో అంతరాయం ఎక్కువగఉన్న చోట పఠన అలవాటును అందించడం వల్ల విద్యార్థులకు విద్యావిజయం, వ్యక్తిగత అభివృద్ధి నైపుణ్యాలు లభిస్తాయనా న్నరు. గురువులను గౌరవించడం, మంచి విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థి ప్రపంచం గురించి వారి జ్ఞానాన్ని విస్తరిస్తారన్నారు. మంచిగా చదవడటం సృజనాత్మకతకు కీలకమైనదిగా పనిచేస్తుందన్నారు. ఊహ చాతుర్యాన్ని ప్రోత్సహిస్తుందనా న్నరు. ఇంగ్లీషు, సైన్స్, జర్నల్స్, ఆధునిక కల్పన, క్లాసిక్ సాహిత్యాన్ని అన్వేషించడానికి ఎంచుకోవచ్చునన్నారు. పిల్లలు విద్యావిజయాన్ని సాధించడానికి మేధోపరంగా అభివృద్ధిచెందడానికి జీవితంలోని సవాళ్లను నమ్మకంగా అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. సువర్చల మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం చేయడం, ఏకాగ్రతతో చదువుతూ మెదడుకు వ్యాయామం చేస్తూ మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని బాగా చదివి మనస్కూల్, హాస్టల్‌కు, మనజిల్లాకు పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంలో ప్రిన్సిపాల్ మంచి కార్యక్రమాలను చేస్తున్న వార్డెన్ , సిబ్బందిని అభినందించారు.

# వైకాపా నాయకుడు మృతి

- మృతదేహానికి నివాళులర్పించిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధంరాఘువవరెడ్డి

**రుద్రవరం, మార్చి 5, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన రుద్రవరంలోని బెస్తకాలనీకి చెందిన వైకాపా నాయకులు, గంగుల అభిమాని పెద్దపెద్దన్న అలియాస్ పెద్దగుండన్న(75) అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక నంద్యాల ఆసుపత్రిలో బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆళ్లగడ్డ వ్యవసాయమార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధంరాఘవరెడ్డి రుద్రవరంలోని మృతుడి ఇంటివద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబీకులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంంలో ఎంపిటిసి తెలుగుచిన్ననాగన్న, అన్నదాసులపెద్దబాలన్న, నెంబర్‌వన్‌షాహిని, నల్లవాగుపల్లెకాదర్‌బాష, ముత్తగాళ్ల వెంకటేష్, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# కడిమెట్లలో.. దేవర ఉత్సవాలు

**ఎమ్మిగనూరు రూరల్ 05మార్చి ప్రభాతవార్త :** మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో బుధవారం కందనాతి శ్రీమారెమ్మ ఆవ్వ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో చేపట్టారు. తెల్లవారుజామున నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు కుంభోత్సవాలు మేల తాళాలతో ఊరేగింపు వచ్చి అమ్మవారి ఆలయం నందు ఉంచి మొక్కులు తీర్చుకుంటారు. వివిధ గ్రామాల నుంచి దేవర ఉత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మిగనూరు మండల పరిషత్ అధ్యక్షులు గొల్ల కేశన్న కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం గ్రామంలో శ్రీమారెమ్మ ఆవ్వ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఐక్యంగా దేవర ను ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు అని ఎంపిపి కేశన్న తెలిపారు.



# 9నెలల సుపరిపాలనకు పట్టం కట్టారు..!

- టిడిపి నేత నరవ రమాకాంత్‌రెడ్డి



**పెద్దకడుబూరు, మార్చి 5, ప్రభాతవార్త :** నిన్న జరిగిన రెండు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవడం రాష్ట్రంలో ఏర్పడిన 9నెలల కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు పట్టం కట్టారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కంటే కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అధిక శాతం ఓట్లు రావడం గమనార్హం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలల కాలంలో రాష్ ్ట ప్రజలందరికి మేలు చేసినందుకే ఉపాధ్యాయులు, పట్టభద్రులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పరిపాలనకు ప్రజలు పట్టం కట్టినట్లు స్పష్టంగా అర్థమవు తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన కూటమి అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

# పౌష్టిక ఆహారం లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**పగిడ్యాల, మార్చి 5, ప్రభాతవార్త**



పౌష్టిక ఆహారం లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయసిబ్బంది విదులు నిర్వహించడం గమన్హారం. మండల కేంద్రమైన పగిడ్యాల యూనిట్ పరిధిలోని 7వ నెంబరు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పిల్లల ఎదుగుదల సరిగాలేకపోవడం వల్ల పౌష్టికాహారం లేనందన పౌష్టికాహారం అందించాలనే ఉద్ధేశ్యంతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆకుకూరలు, కూరగాయల విత్తతనాలు నాటడంతోపాటు వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. అంతటితో ఆగక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వయాన ఆకుకూరలను, కూరగాయలను పండించి ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నా ప్రజాసమస్యల పరిష్కారవేదిక వద్ద ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శిస్తు స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆకుకూరలు కూరగాయలు పిల్లలకు బాగా తినిపించాలనీ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు వివరించారు. ఇందులో బాగంగా అంగన్వాడీ కేంద్రంలో ఆకుకూరల, కూరగాయలు విత్తనాలు నాటించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు యూనిట్ ఇన్‌చార్జ్ పి.సుబ్బమ్మ, అంగన్వాడీ టీచర్ కళావతి, ఆయా ఐసిఆర్పి పి.మురళిమోహన్, ఎం.చంద్రకళ, అశ్విని, బి.జయంతి పాల్గొన్నారు.

# 9న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వార్షికోత్సవ వేడుకలు

**ఆలూరు, మార్చి 5, ప్రభాతవార్త**



ఈ నెల 9వ తేదీన తిరుపతి ఎస్వి యూనివర్సిటీ ఆడిటోరియంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తృతీయ వార్షికోత్సవ వేడుకలు జరుగునని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా బాధ్యుడు బెస్త గోవింద రాజులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్, దక్షిణ భారత దేశ రా ష్ట్రాల గౌరవ అధ్యక్షుడు వెంగమేష్ చౌదరి, ఏపి రాష్ట్ర అధ్యక్షులు రమణకుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. వివిధ రాష్ట్రాల రాష్ట్ర, జిల్లా, తాలుక, మండల స్థాయి పరిధిలోని గొప్ప గొప్ప వ్యక్తులు పాల్గొంటారన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా శక్తివంచన లేకుండా పోరాడుతామని సంస్థ కార్యకలాపాలు అన్ని రాష్ట్రాలకు విస్తరింప చేస్తామని బెస్త గోవిందరాజులు అన్నారు. కావున ఈ వేడుకలకు అందరు తప్పకుండ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

# రైతులు రబీ కంటే ముందు పంటలను సాగు చేయండి



**కొవెలకుంట్ల, మార్చి 5, ప్రభాతవార్త :** రైతులు ఒకే పంట వేయడము వల్ల రాబడి తగ్గుతుందని తొలకరి చినుకులు పడిన వెంటనే రైతులు ఏదో ఒక పంటను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అదికారి మురళీ సూచించారు. బుదవారము పొలం పిలుస్తోంది కార్యాక్రమం మండల పరిదిలోని సౌదరదిన్నె గ్రామంలో నిర్వహించారు. ఈసందర్బముగా జేడిఎ మాట్లాడుతూ రైతులు ప్రతి ఏడాది సాగుచేసిన పంటనే తిరిగి సాగు చేయడము మానాలని ముఖ్యంగా పంటమార్పిడి చేయాలని చెప్పారు. అలాగే ఇక్కడి రైతులు రబీ పంటను మాత్రమే సాగు చేస్తున్నారని అలాకాకుండా తొలకరి చినుకులు పడిన వెంటనే రైతులు పెసర, మినుముకొర్ర లాంటి పైరులను సాగు చేస్తే తిరిగి రబీ పంటను కూడా సాగు చేసుకోవడానిక వీలు ఉంటుందని చెప్పారు. దీనితో రైతు అదాయం కూడాగా పెరుగుతుందని చెప్పారు. కార్యాక్రమంలో ఎఓ నిరంజన్ తదితరులుయపాల్గొన్నారు.

# సమయపాలన పాటించాలి



**రుద్రవరం, మార్చి 5, ప్రభాతవార్త :** సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని రుద్రవరం మండల ఇంచార్జి ఎంపిడిఓ సుబ్రమణ్యం సూచిం చారు. మండలంలోని నరసాపురం, ముత్తలూరు, మందలూరు సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే వారికి సిబ్బంది అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రికార్డుల్లో అవకతవకలు లేకుండ క్రమబద్ధీకరణతో నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ప్రస్తుత వేసవిలో నీటిఎద్దడి రాకుండ ముందుజాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలో ్ల పరిస్థితిని పర్యవేక్షిస్తుండాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఇంచార్జి యుఓపిఆర్‌డి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# విధ్యార్థులకు ఉచితంగా అట్టలు పంపిణీ



**మంత్రాలయం, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విధ్యార్థులకు కర్నూలుమాస్టర్ కాలేజీ సిబ్బంది ఉచితంగా పరీక్షల అట్టలు పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం భోజరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. పాఠశాలలో ఘనంగా నిర్వహించిన సరస్వతి పూజ కార్యక్రమానికి వీరు హాజరై సుమారు 101 మంది విధ్యార్థులకు అట్టలను పంపిణీ చేశారన్నారు. విధ్యార్థులు ఉత్తమంగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని ఉపాధ్యాయులు కోరారు. విధ్యార్థులకు సాంస్కృతిక, డ్యాన్ ్స పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, నీలకంఠస్వామి, ఎర్రన్న, కృపానందం, ఈరమ్మ, కస్తూరి, తారాదేవి, సిఆర్‌పి బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

# నేడు వెలుగోడు గ్రామపంచాయితీ వేలం పాటలు



**వెలుగోడు, మార్చి 5, ప్రభాతవార్తః** వెలుగోడు మేజర్ గ్రామ పంచాయితీకి సంబంధించిన వారపు సంత మార్కెట్, బస్టాండ్ మరియు ఖబేల వేలం పాటలను గురువారం కార్యాలయ అవరణలో నిర్వహిస్తున్న కార్యదర్శి సుంకన్న బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుత వేలం పాటల్లో పాల్గొనే వారు గ్రామపంచాయితీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని, వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేనివారు మాత్రమే వేలం పాటల్లో పాల్గొనాలన్నారు. వారపు సంత మార్కెట్, బస్టాండ్ వేలం పాటల్లో పాల్గొనే వారు ఒక్కొక్కదానికి రూ.50 వేల డిపాజిట్, కబేలకు రూ.30 వేల డిపాజిట్‌ను గ్రామ పంచాయితీ కార్యదర్శి వెలుగోడు పేరట డిడి తీయాలన్నారు. ఈవేలం పాటలు దక్కించుకున్న వారు 01-04-2025 నుండి 31-03-2026 వరుకు వారు రుసుంలు వసూలు చేసుకోవచ్చన్నారు. డిడి చెల్లించిన వారు 11 గంటలకు గ్రామపంచాయితీలో హాజరుకావాలన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

సర్పంచ్ చలవాది రంగమ్మ



**హుళగుంద మార్చి ,05, ప్రభాతవార్త:** హోళగుంద గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ అన్నారు ఈ సందర్భంగా గ్రామాల్లోని వివిధ కాలనీలలో పారిశుధ్య పనులు పంచాయతీ సిబ్బందితో చేపట్టారు ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఇంట్లో ఆరోగ్యంగా ఉంటారన్నారు తమ కాలనీలలో తాగునీరు వీధిలైట్లు డ్రైనేజీ క్లీనింగ్ బ్లీచింగ్ పౌడర్ చెల్లించడం వంటి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకోవాలని సూచించారు ప్రతి ఒక్కరూ కొళాయి ఇంటి పన్నులను చెల్లించాలని సూచించారు తడి చెత్త పొడి చెత్త ఉంటే తమ ఇంటి దగ్గరే పంచాయతీ ట్రాక్టర్ ఇబ్బందితో వచ్చి తీసుకెళ్తారని వారికి తెలిపారు ప్రతి ఒక్కరు గ్రామంలో ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు పంపాపతి పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

# బాల్యాన్ని సంరక్షించాలి..

- ఈసీసీఈ డేపై తల్లులకు అవగాహన..



**కోసిగి, మార్చి 5, ప్రభాతవార్త :** చంటిపిల్లల బాల్యాన్ని సంరక్షించి వారి ఆరోగ్యపై తల్లులు ప్రత్యేక శ్రద్దను కనపరిచి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనఉందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాత్యాయిని అన్నారు..బుధవారం కోసిగిలోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే కార్యక్రమాన్ని నిర ్వహించారు. పిల్లల సంరక్షణపై ప్రత్యేకంగా చొరవ చూపాలంటూ తల్లులకు అవగాహన కల్పించారు..కోసిగిలోని 8,9,13,12,14,15,18,19,11 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబందించి 10వ కేంద్రంలో సీడీపీవో నాగమణి నేతృత్వంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.. ఈ సందర్బంగా సూపర్‌వైజర్ కాత్యాయిని మాట్లాడుతూ 3 సంవత్సరాల వయసు నుండే పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలనా న్నరు..5 సంవత్సరాలు వచ్చే వరకు పిల్లలకు ఈ కేంద్రాలలో ఆటపాటలతోకూడిన విద్యను అందించి ప్రైమరీ పాఠశాలకు పంపేందుకు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. పిల్లలను ప్రతి నెల బరువులు, ఎత్తులు, గమనించివారికి ఉన్న లోపాలను సరిచేసుకునేందుకు ఏర్పాటు ్ల చేయడం జరుగుతోందననా న్నరు. పిల్లలు ఏ సంవత్సరానికి ఎంత బరువు ఉండాలని, ఎంత ఎత్తుపెరగాలని ఈ అంగన్‌వాడీ కేంద్రాలలో తెలుసుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. ముఖ్యంగా ఎంత ఎత్తు, ఎంత బరువు ఉంటే ఆరోగ్యంగా ఉంటారనేది ఇక్కడేనే తెలుసుకోవచ్చునన్నారు.. అంతేకాక పుట్టినప్పటి నుండి 5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ తీయించు కోవాలని తెలియజేసారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, లూస పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి వారికి రుణాలు మంజూరు చేయ్యండి

**కొవెలకుంట్ల, మార్చి 5, ప్రభాతవార్త**



రుణం పొందడానికి అన్ని అర్హతలు ఉన్న వారందరి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంకు మేనేజరు రవీంద్ర బ్యాంకు అదికారులకు సూచించారు. బుదవారము స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపియం చంద్రశేఖరు అద్యక్షతన జాయింట మండలలేవెల్ బ్యాంకు అదికారుల సమావేషము నిర్వహించారు. ఇందులో బ్యాంకు మేనేజర్లు యంపిడిఓ వరప్రసాదు, సిసిలు రవికుమారు, గోపాలకృష్ణ, వెంటస్వామి,. అకౌంట్‌కు బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్బము లీడ్ బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ అలాగే మండలంలో యంపిడిఓ కార్యాలయం ఏమై దరఖాస్తులు పెండింగులో ఉంటే బ్యాంకులకు పంపాలని వాటిని బ్యాంకర్లు ఒకే చేయాలని సూచించారు. అలాగే మార్చి 8వ తేదిన జరిగే జాతీయ మహిళా దినోత్సవము వేడుకల కోసంఎస్‌హెచ్‌జి మహిళా రుణాలు ఇండివిజ్యువల్ ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజస్ గ్రౌండింగుకు సహకరించాలని కోవెలకుంట్ల ఏరియా కోర్డినేటర్ గురుస్వామి అన్ని బ్యాంకు మేనేజర్లను అభ్యర్థించారు

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



**ఆత్మకూరు, మార్చి05, ప్రభాతవార్త:** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ ఎంఎస్ నెంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పెద్ద నాగరాజు, తిమయ్యలు అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ సమ్మె సందర్బంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రజలందరికి అనునిత్యం సేవలందిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. విద్యుత్ నీటి సౌకర్యం కల్పిస్తూ ఎటువంటి అంతరాయం లేకుండా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమస్యలను తక్షణ పరిష్కరించాలని మార్చి 7న జరిగే చలో విజయవాడకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు ఖాజాఖాన్, బాలరాజు, చిన్న నాగరాజు, ప్రసాద్, సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణనదిలో వేటగాళ్లకు దడల్ పుట్టించే.. స్పీడ్‌బోట్ వచ్చేసింది..!?

: శ్రీశైలం నుంచి సంగమేశ్వరం వరకు కృష్ణనదిలోనే స్పీడ్‌బోట్ ప్రయాణం
: సమాచారం వచ్చిన మరుక్షణమే అధిక వేగంతో వెళ్లే బోటురావడం హర్షం
: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో వేటగాళ్లకు గడ్డుకాలమే
: వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచిన ఆత్మకూరు రేంజ్ అధికారులు




**ఆత్మకూరు,మార్చి05,ప్రభాతవార్త:** రెండు రాష్ట్రాల సరిహద్దులో ఆంధ్ర, తెలంగాణ అటవీ డివిజన్ పరిధిలో జరిగే వన్యప్రానుల వేట అక్రమ స్మగ్లింగ్, నదిలో వేటాడే వేటగాళ్లపై ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిపాలన అధికారి విభాగంలో సంగమేశ్వరం - శ్రీశైలం వరకు నదిలోనే అధికారుల ప్రయాణం త్వరగా వెళ్లి స్మగ్లరుల ఆట కట్టేందుకు తమిళనాడు రాష్ట్రం నుంచి స్పీడ్‌బోటును రిజర్వు క్యాంపులో ఏర్పాటు చేశారు. ఈ బోర్టు విలువ దాదాపు రూ.30 లకు పైగా ఉంటుంది. ప్రస్తుతం ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలోని వన్యప్రానులను వేటాడే స్మగ్లరుల ఆట కట్టించేందుకు అటవీశాఖ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని కృష్ణ పరివాహక ప్రాంత మైన ముసలిమడుగు, దుర్గం చీమలతిప్ప, బలపాల తిప్ప, జానాల గూడెం, సంగమే శ్వరంతో పాటు పలు ప్రాంతాలలో స్మగ్లరు లను నియంత్రించే విధంగా సమాచారం ఇచ్చిన మరుక్షణమే నదిలో అతివేగంగా వెళ్లే బోర్టు రావడం ఇదే మొదటిసారి అటవీ శాఖలో ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయా లంటే దాదాపు 12గంటల పాటు నదిలో ప్రయాణం కొనసాగించాల్సి ఉంటుంది. ఈ బోటు రావడంతో కృష్ణనదిలో జరిగే అక్రమ స్మగ్లింగ్ రిజర్వు బేస్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రతి క్షణం స్మగ్లరులపైనే అటవీశాఖ ప్రత్యేక నిఘా ఉంచింది.

**అనుమతులు లేకుండా అటవీలోకి ప్రవేశించే వన్యప్రానులను వేటాడితే శిక్ష తప్పదు...**

అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా వన్యప్రానుల చట్టం 1972 యాక్టు ప్రకారంగా వన్యప్రానులను వేటాడితే శిక్ష తప్పదు. బుధవారం ఆత్మకూరు రేంజ్‌లలో ముసలిమడుగు వీరాపురం గ్రామాలలో కొందరు స్మగర్లరులు వన్యప్రానులను ఉచ్చులతో వేటాడిన విషయాని తెలుసుకున్న అటవీశాక అధికారులు ముద్దాయిలను ఆదుపులోకి తీసుకోని విచారణ చేపట్టి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు సమాచారం. వన్యప్రానుల సంరక్షణ పర్యావరణంను కాపాడుకునే విదంగా ప్రజలు అటవీశాఖ అధికారులకు స్వచ్చం దంగా సహకరించాలని ఆత్మకూరు రేంజ్ అధికారులు గ్రామీణ ప్రాంత ప్రజలకు పత్రిక ముఖంగా తెలియజేశారు.

# బాబు కృషికి.. పట్టుభద్రుల పట్టం

- టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి



**కర్నూలు హాస్పిటల్, మార్చి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత 8 నెలల్లో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో విద్యావంతులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నటువంటి కృషికి ప్రతిఫలంగా పట్టభద్రులు పట్టం కట్టారని టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికై పడుతున్న శ్రమను రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకొని ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పోటీచేసిన అలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు 82,320 ఓట్లు, పేరా బత్తుల రాజశేఖర్‌కు 77,461ఓట్ల మెజార్టీతో కూటమి అభ్యర్థులను గెలిపించి పిడిఎస్ తరుపున వైఎస్సార్‌సీపీ పోటీచేయించిన అభ్యర్థులను దారుణంగా ఓడించి తమ మద్దతును చంద్రబాబు నాయకత్వంలో కూటమికి తెలియజేశారని మొత్తం 67 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు శ్రమకు ఇచ్చిన గుర్తింపేనని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామిలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిలా రాష్ట్రాన్ని దోచుకోలేదని ఆర్థిక వనరులను సమకూర్చుకొని ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వమని తెలిపారు.

## చెత్త రహిత పట్టణమే.. లక్ష్యం



**నందికొట్కూరు,మార్చి 5,ప్రభాతవార్త:** నందికొట్కూరు పట్టణాన్ని చెత్త రహిత పట్టణమే లక్ష్యంగా చేసేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమీషనర్ ఎస్.బేబి తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో కమీషనర్ మాట్లాడుతు పట్టణంలో బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణముగా అన్ని వార్డులనుతీర్చిదిద్దుతున్నామని,చెత్తను ఆరుబయట వేయకుండా తడి-పొడి చెత్తలుగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు కాలనివాసులు అందజేయాలని కమీషనర్ తెలిపారు.ఆరు బయట మల మూత్ర విసర్జనకు పాల్పడకుండా మునిసిపాలిటి పరిధిలోని కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్‌లను వినియోగించుకోవాలని తెలిపారు.ప్రజలు చెత్తను బయటపడేస్తే జరిమానా విధించడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు.

## టిడిపినేత దేరెడ్డి శివనాగిరెడ్డి, మరో ఇద్దరిపై ఎస్‌సి ఎస్‌టి కేసు నమోదు

**నంద్యాల, మార్చి 5, ప్రభాతవార్త ప్రతినిధి** నంద్యాల 38వ వార్డుకు చెందిన టిడిపి నేత దేరెడ్డిశివనాగిరెడ్డి, ఆయన అనుచరుడు, రాఘవేంద్రపై మరో మహిళపై నంద్యాల తాలుకా అర్బన్ పోలీస్‌స్టేషన్లో ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదైంది. నంద్యాల పట్టణ శివారులో 38వ వార్డు వైయస్ఆర్ నగర్ శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజలు నిర వ్యహిస్తున్న దళిత మహిళ సౌభాగ్యవతిని కులం పేరుతో దూషించి ఆలయం నుంచి బయటకు గెంటేసినందుకు శివనాగిరెడ్డి, అనుచరుడు రాఘవేంద్ర, మరో మహిళపై కేసు నమోదైంది. స్పందనలో తనను గెంటేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళితమహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. స్పందించి కేసు నమోదు చేసిన నంద్యాల తాలుకా అర్బన్ పోలీసులకు, జిల్లా అధికారులకు దళిత మహిళ ధన్యవాదాలు తెలియజేసింది.

## గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- జాయింటుకలెక్టరు విష్ణుచరణ్



**నంద్యాల మార్చి 05, ప్రభాతవార్త ప్రతినినిధి** జిల్లా వ్యాప్తంగా రైతుల పొలాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింటుకలెక్టరు విష్ణుచరణ్ రెవెన్యూ, సర్వేశాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం బనగానపల్లె మండలం నందివర్గం గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మండలాల్లో జరుగుతున్న రీసర్వేపనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెవెన్యూ, సర్వే శాఖల అధికారులను ఆదేశించారు. చేపట్టిన సర్వేపనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలన్నారు. సరిహద్దుస్థిరీకరణ, స్టోన ప్లాంటేషన్ తదితర పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కరెక్షన్స్, మ్యుటేషన్ ట్రాన్స్‌యాక్షన్ సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు, గ్రామరైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి చెరువును పరిశీలించిన మైనింగ్ అధికారులు

(వార్త ప్రభావం)

- జిల్లా మైనింగ్,జియాలజీ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి



**మంత్రాలయం,మార్చి 5,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వగరూరు గ్రామంలో ఉన్న సాగునీటి చెరువును జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ అధికారులు బుధవారం పరిశీలించారు.మైనింగ్ ఇన్‌స్పెక్టర్ సాంబశావారెడ్డి,అసిస్టెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో చెరువును పరిశీలించారు.ఫిబ్రవరి 27వతారీఖున ప్రభాతవార్తలో ప్రచురితమైన వగరూరు చెరువులో అక్రమ తవ్వకాలు అన్న కథనానికి అధికారులు స్పందించారు. చెరువులోని వగరూరుగ్రామ పరిధి,పెద్దకడబూరు మండలం జాలవాడి పరిధిలోని స్థలాలను తనిఖీ చేశారు.అక్రమంగా తవ్విన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి చెరువులలో ఎవరుకూడా అనుమతులు లేకుండా తవ్వడానికి లేదన్నారు.ఇరిగేషన్‌అధికారులకు విన్నవించు కొని ప్రభుత్వానికి చలానాకట్టిన తరువాతనే చెరువులో తవ్వకాలు జరపాలన్నారు.అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.వారి వాహనా లను సీజ్‌చేస్తామన్నారు.ఎప్పటికపప్పుడు ఇరిగేషన్,రెవిన్యూ అధికారులు చెరువును పరిశీలించాలన్నారు.వీరివెంట టిక్నికల్ అసిస్టెంట్ దిలీప్,విఆర్ఓ ప్రభాకర్,గ్రామసేవకుడు భీమన్న తదితరులు ఉన్నారు.

# వైభవంగా ధ్వజారోహణం, భేరిపూజ..!

- సింహవాహనంలో దర్శనమిచ్చిన జ్వాలానరసింహస్వామి









**నంద్యాల, మార్చి 5, ప్రభాతవార్త ప్రతినిధి** అహోబిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అహోబిలమఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్‌శఠగోపరంగనాథయతీంద్రమహాదేశికన్ ఆధ్వర్యంలో బుధవారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణం, భేరిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి అహోబిలమఠం 45వ పీఠాధిపతి శ్రీవన్‌శఠగోప నారాయణతీ ంద్రమహాదేశికన్ ఉభయదారులుగా కాగా ఆయన తరపున అహోబిలదేవస్థానం ప్రధానఅర్చకుడు, ముద్రకర్త వేణుగోపాల్ పూజలు నిర్వహించారు. ధ్వజారోహణంలో భాగంగా ధ్వజస్థంభం సమీపంలోని యాగశాలలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి, జ్వాలానరసింహస్వామి మొదటిపీఠాధిపతి విగ్రహాలను కొలువుంచారు. ఎలాంటి విఘ్నాలు లేకుండ ఉత్సవాలు కొనసాగాలని కోరుతూ గరుత్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ధ్వజారోహణంలో భాగంగా సోమకుంభస్థాపన, నిత్యహోమం, పాలివాహనం, గరుడప్రతిష్ఠ, ధ్వజ ఆరోహణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గ్రామశుద్ధిలో భాగంగా ఆలయ పరిసరాల్లో సుదర్శమూర్తిని ఊరేగించామన్నారు. చెన్నై నుంచి అహోబిలం చేరుకున్న వేద పండితులతో వేదపారాయణం జరిపామన్నారు. మధ్యాహ్నం అభిషేకం లో భాగంగా నవపంచామృ తకల శాభిషేకాన్ని ఉత్సవ మూర్తులకు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు రెండోసారి రక్షాబంధనం చేశామని ఆయన తెలిపారు. అభిషేకంలో భాగంగా తేనె, నెయ్యి, వంటి వాటితో అభిషేకం జరిపారు. గంధం, పసుపుతో ఉష్ణోదకం చేశారు. అనంతరం అర్చకులు హారతి, మహాహారతి అందజేశారు. అలాగే నరసింహస్వామి హిరణ్యకశిపుని సంహరించి ధరాత్మన్ని కాపాడిన అంశాన్ని చాటిచెబుతూ ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామి ఎగువ అహోబిలంలో సింహవాహనంపై జ్వాలానరసింహ స్వామి దర్శనమిచ్చారు. అలాగే దిగువ అహోబిలంలో బుధవారం సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా దిగువ అహోబిల ఆలయానికి ఎదురుగా ఉన్న మండపం వద్ద మట్టిని సేకరించి విశ్వక్సేనుని యాగశాలకు తరలించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అహోబిలమఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్‌శఠగోప రంగనాథయతీంద్ర మహాదేశికన్ దిగువ అహోబిలం లోని మండపం వద్ద ఆశీనులై ఉండగా అర్చకులు అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతికి దేవస్థానం వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టువస్త్రాలు అందజేసి శఠారీ ఇచ్చారు. ఇందులో భాగంగా పీఠాధిపతికి స్వాముల వారిని దర్శించుకుని మంగళశాసనం చేశారు. ఈ కార్యక్రమంలో అహోబిలమఠం, దేవస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.

**అహోబిలంలో నేడు:**

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హంసవాహనం, మధ్యాహ్నం అభిషేకం, రాత్రి సూర్యప్రభ వాహనం, దిగువ అహోబిలంలో ఉదయం ధ్వజారోహణ, మధ్యాహ్నం అభిషేకం, సాయంత్రం భేరిపూజ, రాత్రి సింహవాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అహోబిల దేవస్థానం ప్రతినిధులు తెలిపారు.

## పిల్లల సంరక్షణ బాధ్యత.. తల్లిది

- సీడీపీవో ఉమామహేశ్వరమ్మ



**బనగానపల్లె, మార్చి5, ప్రభాతవార్త:** పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదని బనగానపల్లె శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలోని అంగన్‌వాడీ 6వ సెంటర్‌లో గర్భవతులు, బాలింతలకు బుధవారం ఈసీసీఈ దీమ్ సంఖ్య మరియు సృజనాత్మకత దినోత్సవంలో భాగంగా మేధాభివృద్ధి మరియు గణితాభివృద్ధి ఎలా ఉన్నది, ఆటలు, పాటలు, కబుర్లు, కథల ద్వారా పిల్లలు నేర్చుకున్న వాటి పై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, పిల్లల సంరక్షణ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ చిట్టెమ్మలు మాట్లాడుతూ తక్కువ బరువు ఉండడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతారని పిల్లలు తక్కువ బరువు ఉండకుండా చూసుకునే బాధ్యత ప్రతి తల్లిదన్నారు. గర్భవతులుగా ఉన్నప్పుడు పౌష్ఠికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణమైన, ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని తెలిపారు. పిల్లల బరువు తక్కువగా ఉండడం వల్ల బుద్ధిమాంద్యం, కంటిచూపు లోపం తదితర అనారోగ్యం కలిగిన పిల్లలు జన్మిస్తున్నారన్నారు. కావునా ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మించాలంటే ప్రభుత్వం ఇస్తున్న పౌష్ఠికాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లితోపాటు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని వారు తెలిపారు. గర్భవతులు డాక్టర్ చెప్పే సలహాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆయా చిన్నమ్మ, ఏఎన్ఎం నాగేశ్వరి, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## కేసి కెనాల్ ఆయకట్టుకు విఘాతం కల్పించవద్దు

- ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నీటి నిలుపుదల వద్దు
- ఎం.పి.డాక్టర్ బైరెడ్డి శబరి



**నంద్యాల హాస్పటల్,మార్చి 5,ప్రభాతవార్త:** ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల ఆపవద్దని, నీటి విడుదల ఆపితే కేసి కెనాల్ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతుల పంటలను కాపాడాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టిడిపి ఫ్లోర్ లీడర్‌డాక్టర్.బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. కర్నూలు-కడప జిల్లాల పరిధిలో కేసి కెనాల్ ఆయకట్టు కింద రైతులు రబి సీజన్‌లో సుమారు 90 వేల ఎకరాలు పంట సాగుచేశారనిఈ రబి పంటలకు ఏప్రెల్ 30వ తేదీఈ వరకు నీరు అంధించాల్సిన అవసరం ఉందని ఎం.పి.తెలిపారు. అయితే కృష్ణానదిలో నీటి ప్రవాహం తగ్గుతుందన్న కారణంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసి కాలువలో నీటి విడుదలను ఆపాలను కోవడం సరికాదని, రబీ సీజన్ పంట చివరి దశకు వచ్చిందని నీటిని నిలుపుదల చేయడం వల్ల సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆమె వివరించారు.కేసి కెనాల్ ఆయకట్టు రైతుల కష్టాలుప్రభుత్వం దృష్టికి తీసెకొని పోతామని ఎం.పి.తెలిపారు.

# నీళితోట్ల వీదిలో అతిసారా కేసులు.. తగ్గుముఖం..!

: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకోని ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి
: మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు





**ఆత్మకూరు,మార్చి05,ప్రభాతవార్త:** గత వారం రోజుల నుంచి మునిస్పాలిటిలోని 5వవార్డు పరిధిలోని నీళ్లితోట్ల వీధిలో అతిసారా సోకి ప్రజలు ఆనారోగ్యాల పాలు అవుతున్నారనే విషయాని దృష్టిలో ఉంచుకోని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కలిప్ంచి మంచినీటి వసతులపై నూతన పైప్పులైన్ ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు 24గంటలు గడవక ముందే నీటిని సరఫరా చేశారు. అతిసారా కేసులు తగ్గుముఖం పట్టాయని మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు బుధవారం విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే మౌళిక సదుపాయాలు కలిప్ంచాలని ఆదేశాలు జారీ చేసిన్నట్లు తెలిపారు. ముఖ్యంగా వార్డు పరిధిలో మున్సిపల్ వాటర్ కలుషితం అయిందని ప్రజలు చెప్పిన ఆపోహాలకు అనుగుణంగా ల్యాబ్ టెసిటంగ్ ద్వారా నీటి నమునాలను సేకరించి వచ్చిన రిపోర్టు ఆధారంగానే ప్రజలకు నూతన పైప్పులైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శరవేగంగా పైప్పులైన్‌ల ద్వారా నీటిని అందించడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్యశిభిరం, డ్రైనేజి కాల్వల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ పలు మౌళిక వసతులు కల్పించే విదంగా పనిచేస్తున్నారని తెలిపారు. వార్డు ప్రజలు మసాలలతో కూడిన ఆహర పదార్థలు తీసుకుంటే ఆనారోగ్యాలకు గురవుతారని అన్నారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలంటే గుడ్డు, చికెన్, మాంస ఉత్పత్తులు ఆహరలను తగ్గించి మాసాలలు లేకుండా వేడి వేడి ఆహర పదార్థలు తీసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రత ఉండడం వలన ప్రజలు తమ ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం వారి చేతులోనే ఉందని వివరించారు. నీళ్లితోట్ల వీదిలో ప్రజలకు రావాల్సిన మంచినీటి వసతులు కలిప్ంచే విదంగా మున్సిపల్ అధికార యంత్రాంగం విధులు నిర్వహిస్తున్నామని సూచించారు.

## రసవత్తరంగా.. ఎద్దుల బండలాగుడు పోటీలు

- పోటీలను ప్రారంభించిన ఆలయ పీఠాధిపతి బసలింగమ్మ అవ్వ



**పెద్దకడుబూరు,మార్చి 5,ప్రభాతవార్త** మండల పరిధిలో బాపురం గ్రామంలో శ్రీ గంగాభవాణి దేవి రథోత్సవ వేడుకలు పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు బుధవారం రసవత్తరంగా జరిగాయి. అంతకుముందు ఆలయ పీఠాధిపతి బసలింగమ్మ అవ్వ జిల్లా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పాలొ నేందుకు వివిధ గ్రామాల నుండి ఎద్దులు పాల్గొన్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎద్దుల బండలాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి రైతలు భారీసంఖ్యలో తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి కింద రూ.27వేలు,రెండో బహుమతి రూ.21వేలు,మూడో బహుమతి రూ.15వేలు,నాల్గో బహుమతి రూ.10వేలు చొప్పున పీఠాధిపతి,గ్రామపెద్దల చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వీరేష్‌గౌడ్,నరసింహులు,హనుమంతు,మహదేవ,వైసిపి నాయకులు హనుమంతరెడ్డి, యల్లప్ప,బ్రహ్మయ్య,వీరేష్,టోర్నమెంట్ నిర్వాహకులు హనుమంతు,నరసప్ప,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## మైపర్‌లో.. ట్రాఫిక్‌పైన అవగాహన సదస్సు



**కర్నూలు విద్య, మార్చి 5, ప్రభాతవార్త:** నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాల నందు బుధవారం ట్రాఫిక్‌పైన అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో నగర ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ మన్సూరుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు వాటిని ఉల్లంఘిస్తే ఏవిధమైనటువంటి చర్యలు ఉంటాయని దానిమీద అవగాహన కల్పించడం జరిగింది. కొన్ని విడియోలను ప్రదర్శించి ఏవిధమైనటువంటి తప్పులు చేయకుండా వాహనాన్ని నడిపి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండటానికి వారు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఉశేన్‌సా, కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డా.కె మహాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మరియు వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలీ డబ్బులు.. ఇప్పించండి సారూ..

: పట్టించుకోని అధికారులు



**ప్యాపిలి మార్చి5 ప్రభాతవార్త:** గ్రామాలలో వలసలను నివారించ దానికి అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులకు నిధుల బకాయిలు పెరిగిపోతున్నాయి. చేసిన పనులకు డబ్బులు రాక కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. ప్యాపిలి మండలంలోఉపాధి హామీ పనుల కు మూడు కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు సమాచారం. మండలంలోమినీ గోకులం షెడ్డు, సిసి రోడ్లకుదాదాపు కోటి రూపాయల వరకు బిల్లులు ఇవ్వలేదని తెలిసింది. అదే విధంగా పది వారాల నుండి ఉపాధి కూలీలకు దాదాపు రెండు కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఉపాధి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ కాక పోవడంతో ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి పనుల కోసం వెళ్లిన క ఆటోలకు డబ్బులు ఇవ్వలేక పోతున్నామని వాపోతున్నారు. గుంతలు, చెరువులు గుట్టలు పనికి వెళ్లిన తమకు డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చేసిన పనులకు మూడు నెలలుగా కూలీ డబ్బులు రాకపోతే పూట గడవడం కష్టమైందని ఉపాధి కూలీలు వాపోతున్నారు. కూలీ డబ్బుల పంపిణీలో ఎప్పుడు ఇలా జరగలేదని ఉపాధి కూలీలు చెబుతున్నారు. ఒక వైపు కూలీల చేతికి డబ్బులు రాక అవసరాల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామని వాపోయారు. ఇప్పట్కికైనా అధికారులు స్పందించి తమకు కూలీ డబ్బులను ఖాతాలలో జమ చేసి ఆదుకోవాలని ఉపాధి కూలీలు వేసుకుంటున్నారు. కూలీ డబ్బులను ఇప్పించండి సారూ అంటూ వేసుకుంటున్నారు....